క్లుప్తంగా

తీరంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం



సాగర్‌నగర్ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారి అనంత శంకర్

కొమ్మాది : సాగర్‌నగర్ బీచ్ రోడ్డు, గుడ్లవానిపాలెం, ఇస్కాన్ ఎదురుగా సముద్ర తీర ప్రాంతంలోని పది హెక్టార్ల అటవీ భూముల్లో సరుగుడు, తాటి చెట్లు నాటే కార్యక్రమాన్ని విశాఖ పోర్టు ట్రస్ట్ సౌజన్యంతో చేపడుతున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి అనంత శంకర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ ప్రాంతాల్లో ఆయన పర్యటించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి, తుపాన్లు, సునామీ వంటి విపత్తులను తీరంలో గల తాటి చెట్లు అద్భుతంగా ఎదుర్కొంటాయని తెలిపారు.

దోమల నివారణకు వీధుల్లో ఫాగింగ్



సంతపేటలో ఫాగింగ్ నిర్వహిస్తున్న మలేరియా నివారణ సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ మలేరియా నివారణ సిబ్బంది దోమల నివారణకు గాను శుక్రవారం వీధుల్లో ఫాగింగ్ నిర్వహించారు. సంతపేట రెడ్డివీధి, గొల్లవీధి, కుమ్మరివీధి, గణేష్ థియేటర్ ఏరియా, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేస్తూ, దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఇళ్ల చుట్టూ, పాత్రలలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్రిడ్జ్‌ను తరచూ శుభ్రం చేయించడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. నివాసాలకు దగ్గరగా పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. వారంలో ఒకరోజు తప్పనిసరిగా డ్రై డే పాటించాలన్నారు. శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల రహదారితో అవస్థలు



శిథిలమైన రహదారి

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం నుంచి అవనాపు వారి కల్లాల మీదుగా వెళ్లే రహదారి శిథిలమైంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణాపురం నుంచి పద్మనాభం గ్రామంలోకి వెళ్లేందుకు ఇది దగ్గర దారి కావటంతో ప్రజలు దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అవనాపు వారి కల్లాల సమీపంలో రోడ్డు పెచ్చులూడిపోయింది. దీని వల్ల ద్విచక్ర వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వర్షంతో వరికి మేలు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతన్నల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 6,400 ఎకరాలు కాగా 4వేలు ఎకరాల్లో నాట్లు వేశారు. కృష్ణాపురం మద్ది, తునిపాలెం, విలాస్కాన్‌పాలెం, పద్మనాభం, పొట్నూరు, అనంతవరం, ఇసకలపాలెం, పొట్నూరు గ్రామాల్లో ఈ నాట్లు వేశారు. వేసవిని తలపించే విధంగా ఎండలు కాస్తుండంతో వరి నాట్లు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన వరి నాట్లు ఎండి పోయే పరిస్థితులు ఏర్పడంతో రైతన్నలు ఆందోళన చెందారు. ఇంతలో శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి 6.15 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వరి పంట జీవం పోసుకుంది.

మహాలక్ష్మీ.. నమోస్తుతే



మధురవాడలో అమ్మవారి విగ్రహానికి బంగారు ఆభరణాలతో అలంకరణ



దుర్గాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



లక్ష్మీనారాయణ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

కొమ్మాది : స్థానిక శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాత సేవ అనంతరం శ్రీ లక్ష్మీ నారాయణులను వజ్రకవచ ధారులను చేసి అర్చన, అలంకరణ జరిపి శ్రీ అష్ట లక్ష్మీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో..

రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

సిరులతల్లీ నమోస్తుతే..

మధురవాడ : సిరులు కురిపించే వరలక్ష్మీ మాతకు ఎక్కడ చూసినా మహిళలు విశేషంగా వ్రతాలు నిర్వహించారు. కొందరు కలశాలు ఏర్పాటు చేసి పూజలు చేస్తే మరికొందరు విగ్రహాలనే ఏర్పాటు చేసి బంగారు నగలతో అలంకరించి మరీ వ్రతాలు చేశారు. అలాగే చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, ఐటీ సెజ్ కూడలి దగ్గర గల శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వరస్వామి ఆలయంలో ఉదయం, సాయంకాలం కూడా భక్తులు విశేషంగా తరలి వచ్చి పూజలు చేశారు.

ఇంటింటా శ్రావణలక్ష్మి పూజలు..

పీఎం పాలెం : బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరి శంకర మఠంలో విరాజిల్లుతున్న శారదా పరమేశ్వరి అమ్మవారికి, ఉమాదేవికి మఠం గౌరవ ధర్మాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అర్చనలు చేశారు. అలాగే కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయం, ఆర్‌హెచ్ కాలనీలోని పైడిమాంబ దుర్గాలమ్మ ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

లక్ష్మీదేవికి ఘనంగా పూజలు..

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పూజలు మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లక్ష్మీదేవికి పలు రకాల పండ్లు, నైవేద్యాలు సమర్పించారు. బంగారం, నగదు లక్ష్మీదేవి చిత్రపటం ముందు ఉంచి పూజలు చేశారు. ఇళ్లను మామిడి తోరణాలతో అందంగా అలకరించారు.

కార్మికవాడలో పారిశుధ్య పనులు చేపట్టాలి



చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపం వద్ద పెరుగుతున్న తుప్పలు

తగరపువలస : చిట్టివలస కార్మికవాడ చుట్టూ పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో నివాసాల మధ్య తుప్పలు పెరుగుతున్నాయి. జ్యూట్‌మిల్లు రన్నింగ్‌లో ఉన్నప్పుడు మిల్లు పారిశుధ్య సిబ్బంది నిత్యం కార్మికవాడను శుభ్రం చేసేవారు. మిల్లు మూతపడిన తర్వాత అక్కడి బాధ్యతలను జీవీఎంసీ చేపట్టింది. కార్మికవాడలో సగానికి పైగా కార్మికులు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయినా ఇంకా కొన్ని కార్మిక కుటుంబాలు ఉన్నాయి. అలాగే మిల్లు కల్యాణ మండపంతో పాటు దాని ఆవరణలలో కార్మిక కుటుంబాలు సీజన్‌లో ఫంక్షన్లు నిర్వహించుకుంటున్నాయి. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, జీవీఎంసీ భీమిలి జోన్‌కు సంబంధించిన సమావేశాలు అప్పుడప్పుడు ఒంటివాసా, కల్యాణ మండపం, లేబర్ వెల్ఫేర్ సెంటర్లలో జరుగుతున్నాయి. అందువలస ఈ ప్రాంతాల్లో జీవీఎంసీ పారిశుధ్య పనులు చేపట్టాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి. శుభ్రత లేకపోవడంతో ఈ ప్రాంతాలను పలువురు మూత్ర విసర్జనకు వినియోగిస్తున్నందున దుర్గంధం వ్యాపిస్తుందని అంటున్నారు. దీని వలన అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని కోరుతున్నారు.

మూన్నాళ్లకే మూలకు చేరిన వాటర్ ట్యాంక్

- మారికవలస ఆర్‌జీకే కాలనీ యూపీహెచ్‌సీలో



మారికవలస ఆర్‌జీకే యూపిహెచ్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

మధురవాడ : ప్రభుత్వం ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయాలనే సంకల్పంతో సుమారు కోటి రూపాయలు వెచ్చించి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ని ఏర్పాటు చేసింది. ఇందులో వైద్య సేవలతో పాటు 60 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తూ అన్ని సదుపాయాలు కల్పించింది. ఇందులో భాగంగా తాగునీటి అవసరాల కోసం వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాది కూడా పూర్తి కాక ముందే ఈ వాటర్ ట్యాంక్ మూలకు చేరింది. కరోనా నేపథ్యంలో వాటర్ ట్యాంక్‌ను చేత్తో తాకనవసరం లేకుండా కాలితో ఉపయోగించుకునే సదుపాయం కల్పించారు. సరైన నిర్వహణ లేక ఇదిప్పుడు మూలకు చేరింది. పైగా దీనిపై మూత కూడా లేకపోవడంతో స్వచ్ఛమైన నీరు అందే అవకాశం లేకుండా పోయింది. వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

శిల్పారామంలో చంద్రయాన్‌-3 విజయోత్సవం



సంబరాల్లో పాల్గొన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పీఎం పాలెం: చంద్రయాన్‌-3 విజయవంతం కావడంతో జాతర వాకర్స్ సభ్యులు శిల్పారామంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకం ఎగరవేశారు. జాబిల్లిపై త్రివర్ణాల నమూనాను ప్రదర్శిస్తూ జయధ్వానాలు చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తెంటు సూర్యనారాయణ, నారాయణ స్వామి, బైరాగి రాజు అరవింద్ కుమార్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వలందపేట వాసులకు శ్మశాన దారి కష్టాలు



శ్మశానవాటిక రహదారిలో మొలిచిన తుప్ప



సంగివలస శివారులోని గెడ్డలో నుంచి శ్మశానవాటికకు రహదారి

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేట గ్రామస్తులకు స్మశాన వాటిక రహదారి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ గ్రామస్తులు తమలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమిలి మండలం తాటితూరు రెవెన్యూ పరిధిలో ఉన్న శ్మశాన వాటికకు ఉసూరుమంటూ వెళ్లవలసి వస్తోంది. ఇందుకోసం కొందరి జిరాయితీ భూముల నుంచి అంతిమ యాత్ర చేయాలి. ఈ మార్గంలో తుప్పల కారణంగా అంతిమయాత్ర సాఫీగా సాగడం లేదు. అలాగే సంగివలస శివారులో ఉన్న గోస్తనీగెడ్డ వద్ద మోకాలి నుంచి నడుము లోతు ఉన్న గెడ్డను పాడె మోసుకుని వెళ్లడం కష్టంగా ఉంటుంది. మూడేళ్ల క్రితం ఈ గెడ్డను దాటడం కోసం వలందపేటలో ఒక దాత సిమెంట్ పైపులు, మెటీరియల్ సమకూర్చినా తాళ్లవలసకు చెందిన కొందరు వంతెన నిర్మిస్తామని ఆశ పెట్టి తప్పుకున్నారు. దీంతో వలందపేట వాసులకు దారి పొడవునా సరైన మార్గం కనిపించడం లేదు. పోనీ ఎన్ని కష్టాలు పడి శ్మశాన వాటికకు చేరుకున్నా అక్కడ ఇసుక కోసం సంగివలస వాసులు శ్మశాన వాటికను గుల్ల చేస్తుండటంతో వలందపేట వాసులు కలత చెందుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ రహదారితో పాటు శ్మశాన వాటికలో వసతులు, రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తుప్పల్లో పడి ఉన్న గెడ్డలో నిర్మాణానికి తెచ్చిన సిమెంట్ పైపులు

లక్ష్మీపురం సర్పంచ్ ప్రమాణ స్వీకారం నేడు



లచ్చుభుక్త జగదీశ్వరరావు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామ సర్పంచ్‌గా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన లచ్చుభుక్త జగదీశ్వర రావు ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయంలో జరగనుంది. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పంచాయతీ నాయకులు కోరారు.

బెర్కాడియా సంస్థతో గీతం ఎంవోయూ

కొమ్మాది : అమెరికా, మెక్సికో, కెనడా, యూరప్, ఆసియా దేశాల్లో అతి పెద్ద రియల్ ఎస్టేట్ ఫైనాన్స్ కంపెనీలో ఒకటైన బెర్కాడియా సంస్థతో గీతం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గీతం అకడమిక్ ప్రొ వైస్ చాన్స్‌లర్ జయశంకర్ వారియర్ సమక్షంలో బెర్కాడియా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుదీప్తో ముఖర్జీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఎంఓయూలో భాగంగా గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాంగణ నియామకాల్లో సహకారంతో పాటు నిపుణులతో ప్రసంగాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పీఎం పాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పీఎం పాలెం ఫీడర్ లైన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున సంబంధిత ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని జోన్‌-3 ఈఈ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా హౌసింగ్ బోర్డు కాలనీ, అశోక్ నగర్ ఏరియా, యాక్సిస్ బ్యాంకు వెనుక ప్రాంతం, పాత పంచాయతీ ఆఫీస్ ఏరియాలలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మాజీ సైనికుడికి పరామర్శ

తగరపువలస: పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో ఇటీవల దాడికి గురైన మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణను సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో జిల్లా సైనిక్ బోర్డు అధికారులు జి.సత్యానంద, జి.కృష్ణారావు తదితరులు శుక్రవారం పరామర్శించారు. ఈ నెల 15వ తేదీన ఆదినారాయణపై దుండగులు హత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. సైనిక్ బోర్డు అధికారులు ఆదినారాయణతో మాట్లాడుతూ దాడి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. పోలీసులు కూడా దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని, ఆదినారాయణ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. వీరితో పాటు మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి తదితరులున్నారు.

రైల్వే టీటీఈకి అభినందన



ఉంగరాన్ని ప్రయాణికుడికి అందిస్తున్న టీటీఈ రెడ్డి

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్, కమర్షియల్ విభాగంలో ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ)గా విధులు నిర్వర్తిస్తున్న డి.ఆర్.ఎం.రెడ్డి నిజాయితీని పలువురు ప్రశంసించారు. రైల్లో ఓ ప్రయాణికుడు మరచిపోయిన బంగారు ఉంగరాన్ని తిరిగి అతడికి అయన అందజేసి నిబద్ధతను చూపారు. వివరాలిలా.. శివ కరణం అనే ప్రయాణికుడు ఈ నెల 23న బెంగళూరు–హౌరా రైలు థర్డ్ ఏసీ కోచ్‌లో తిరుపతిలో బయలుదేరి 24న విశాఖకు చేరుకున్నాడు. ఇక్కడ గురువారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి రైలు దిగిపోయాడు. కొద్దిసేపటికి తన గోల్డ్ రింగ్ రైలులో పోగొట్టుకున్నట్టు అతడు గుర్తించి లాబీలో ఆన్‌డ్యూటీలో ఉన్న టీటీఈకి సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన ఆయన బెంగళూరూ–హౌరా రైలులో విధి నిర్వహణలో ఉన్న టీటీఈ డి.ఆర్.ఎం.రెడ్డికి సమాచారం చేరవేశారు. ఈయన తక్షణం శివ ప్రయాణించిన బెర్త్ వద్దకు వెళ్లి తనిఖీ చేసి ఉంగరాన్ని కనుగొన్నారు. వెంటనే ఆ ప్రయాణికుడికి దాన్ని అందజేశారు. సుమారు రూ.35 వేల విలువైన తన గోల్డ్ రింగ్ తిరిగి దొరకడంతో శివ సంతోషం వ్యక్తం చేశాడు. టీటీఈకి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి టీటీఈ రెడ్డికి అభినందనలు తెలిపారు.

ఐటీ సెజ్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు

- ప్రతి రోజూ లోకల్‌లో 8 ట్రిప్‌లు



కార్‌షెడ్ నుంచి ఐటీ హిల్స్ వెళ్తున్న 25 ఐటీ సిటీ బస్సు

మధురవాడ : ప్రభుత్వం ఐటీ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా ఐటీ హిల్స్ మీద రోడ్లకు మరమ్మతులతో పాటు బీటీ లేయర్ కూడా వేశారు. ఇటీవల ఐటీ ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం బస్సును ఏర్పాటు చేశారు. గతంలో ఉద్యోగులు బస్సులు, ఆటోలు లేక సాయంత్రం 6 తర్వాత ఐటీ హిల్స్ నుంచి రుషికొండ బీచ్ రోడ్డుకు కాలి నడకన వెళ్లేవారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. మద్దిలపాలెం డిపోకి చెందిన ఈ బస్సు కార్‌షెడ్ జంక్షన్ నుంచి ఐటీ హిల్స్ మధ్య 8 ట్రిప్పులు తిరగనుంది. పైగా మారికవలస నుంచి, మధ్యలో విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌ని కలుపుతూ ట్రిప్పులు ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంత వాసులు, ఐటీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బస్ టైమింగ్ ఇలా..

మద్దిలపాలెం డిపోకి చెందిన ఈ బస్సు ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు విశాఖ సెంట్రల్ బస్టాండ్ నుంచి బయలుదేరి కార్‌షెడ్ మారికవలస జంక్షన్ (తిమ్మాపురం రోడ్డు, వుడా హరిత) మీదుగా ఐటీ హిల్ నంబర్‌-2లో గల మహతి, సింబియాసిస్‌కు 7 గంటలకు చేరుతుంది. 8 గంటలకు విశాఖలో బయలుదేరి కార్‌షెడ్, వుడా కాలనీ మీదుగా ఐటీ హిల్స్ చేరుకుంటుంది. 9 గంటలు, 9.55, 12, 13.00, 14.00, 15.00, 17.00, 19.00 గంటలకు ఐటీ హిల్స్ నుంచి బయలుదేరి కార్‌షెడ్ నుంచి ఐటీ హిల్స్‌కి 9.30, 11.20, 12.30, 13.30, 14.30కి బయలుదేరుతుంది. అలాగే మారికవలస జంక్షన్ మీదుగా 6.30, 15.30, 16.30, 18.30, 19.30లకు ఐటీ హిల్స్ వెళ్తుంది. విశాఖ సెంట్రల్ బస్‌స్టాండ్ నుంచి 6.00, 8.00, 10.45, 16.00, 18.00, గంటలకు ఐటీ హిల్స్ బయలుదేరుతుంది. ఐటీ హిల్స్ నుంచి కార్‌షెడ్ వచ్చేటప్పుడు ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా రెవెన్యూ కాలనీ, ఎంవీపీ మీదుగా కార్‌షెడ్ చేరుకుంటుంది.

చిల్లవాని చెరువులో చేప పిల్లల విడుదల



చెరువులో చేపపిల్లలు విడుదల చేస్తున్న మత్స్యశాఖ, పంచాయతీ అధికారులు, పాలకవర్గం ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు చిల్లవాని చెరువులో తాటితూరు స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ ప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులు, పంచాయతీ పాలకవర్గం శుక్రవారం లక్ష చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ తరచూ చెరువులో చేపలు దొంగతనాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సర్పంచ్ శిరిగుడి సంతోషి మాట్లాడుతూ వ్యవసాయరంగంలో చేపలసాగు భాగమన్నారు. మత్స్యకారులను కూడా రైతులుగా గుర్తించి రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిరిగుడి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, మత్స్యకార నాయకులు సింగిడి గణేష్, సింగిడి అప్పలరాజు, మేడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని (14) అదృశ్యం అయినట్టు పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని డెయిరీ ఫారం ఇంద్రానగర్‌లో నివాసం ఉంటున్న బాలిక 12వ తేదీన పాఠశాలకు వెళ్తానని ఇంటి నుంచి బయటికి వెళ్లింది. సాయంత్రం 4 గంటలు దాటినా ఇంటికి రాలేదు. తర్వాత తెలిసిన చోట్ల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి శృతి గురువారం పీఎంపాలెం సీఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ శ్యాంప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. తమకు శేఖర్ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్‌హెచ్‌వో రామకృష్ణకు 94407 96060 నంబర్‌లో తెలపాలన్నారు. లేదా విచారణాధికారి శ్యామ్‌కు 97042 64618కి నంబర్‌లో సమచారం ఇవ్వాలని కోరారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్యా యత్నం

- రక్షించిన భీమిలి పోలీసులు



రక్షించిన వ్యక్తితో భీమిలి పోలీసులు

భీమునిపట్నం: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని భీమిలి పోలీసులు గురువారం రాత్రి రక్షించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పెందుర్తి చినముషిడివాడకు చెందిన పొట్నూరు రవితేజ (34) ఆన్‌లైన్ ఆటలకు బానిసై సుమారు రూ.15లక్షల వరకు బ్యాంకుల దగ్గర అప్పు చేశాడు. వారి నుంచి ఒత్తిడి పెరగడంతో స్విగ్గీ డెలివరీకి వెళ్తున్నానని సాయంత్రం 7 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 10.30 గంటల సమయంలో అప్పుల వివరాలు, తప్పులు తన బావకు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి, సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు. దీంతో వారు 100కి ఫోన్ చేయడంతో నైట్ డ్యూటీలో ఉన్న ఎస్ఐ హరీష్, ఇతర పోలీసు సిబ్బంది గాలింపు చేపట్టారు. భీమిలి బీచ్‌రోడ్డులో ఎర్రమట్టి దిబ్బల ఎదురుగా సదరు వ్యక్తిని రక్షించారు. అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు.

బంతాట మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు



చిట్టివలస బంతాట మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో క్రీడాకారుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఈ జిమ్‌ను స్థానిక క్రీడాకారులు శుక్రవారం నుంచి వినియోగంలోకి తీసుకున్నారు. ఈ ప్రాంతంలో ఓపెన్ జిమ్ కోసం పోలమాంబ ఫుట్‌బాల్ జట్టు ప్రధాన కార్యదర్శి అక్కరమాని చినబాబు ఇటీవల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి అధికారులకు సూచనలు చేయడంతో రూ.4.40 లక్షల విలువైన పరికరాలతో యుద్ధప్రాతిపదికన ఈ జిమ్‌ను ఏర్పాటు చేశారు. క్రీడాకారులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

అధునాతన ఔషధాలతో క్యాన్సర్ నివారణ



డాక్టర్ మాధవిని సన్మానిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధి నివారణకు అధునాతన పద్ధతులు, ఔషధాలు వచ్చాయని అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ గౌరుసు మాధవి అన్నారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ టీచింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'ప్రివెన్షన్ మెడిసిన్‌–అంకాలజీ'అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల ప్రపంచంలో క్యాన్సస్ వ్యాధి పెరుగుతోందని అన్నారు. మద్యం, ధూమపానం, వంశపారంపర్యంగా ఈ వ్యాధి సోకుతోందన్నారు. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ఏఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవిని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.